క్లుప్తంగా

రోగులకు పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న బాల్క సుమన్, కొప్పుల ఈశ్వర్, నడిపెల్లి దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రోగులకు మాజీ ప్రభుత్వ విప్, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావులతో కలిసి పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్, నాయకులు పాల్గొన్నారు.

చదువుతోనే మహిళా వృద్ధి

శ్రీరాంపూర్: చదువుతోనే మహిళలు అన్ని రంగాల్లో వృద్ధి సాధిస్తారని మహిళా సాధికారిక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక తెలిపారు. మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఆదేశాల మేరకు నస్పూర్‌లోని సృష్టి పాఠశాలల్లో సోమవారం మహిళ హక్కులు, పథకాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మహిళలకు విద్య ఎంత అవసరమో తెలిపారు. భేటీ బచావో–బేటీ పడావో పథకం గురించి వివరించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ చట్టం గురించి అవగాహన కల్పించారు. లింగ సమానత్వం, బాల్య వివాహ నిరోధక చట్టం వంటి వాటిపై ప్రసంగించారు. మహిళలకు కల్పించిన చట్టాలు వాటి సద్వినియోగం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లను తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ అంబాల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి సన్మానం



అక్షయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

జన్నారం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉద్యమకారుల సన్మాన కార్యక్రమంలో భాగంగా సోమవారం జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన మేకల అక్షయ్ కుమార్‌ను మంత్రి సీతక్క సన్మానించారు. ఈ సందర్భంగా అక్షయ్‌కుమార్ మాట్లాడుతూ తనకు ఈ గౌరవం దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

కాలువల్లో పూడికతీత పనులు



మురుగు పరిశీలిస్తున్న మారుతిప్రసాద్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 17వ వార్డు బృందావన కాలనీ, సీతారామ కాలనీ, నాగదేవత కాలనీ, చున్నంబట్టి వాడల్లో వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని, ముందస్తు చర్యల్లో భాగంగా మత్తడి కాలువ, డ్రెయినేజీల్లోని పూడికను తీసే పనులను మున్సిపల్ అధికారులు సోమవారం ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, మున్సిపల్ డివిజనల్ ఇంజనీర్ మధుకర్, వార్డు కౌన్సిలర్ పూదరి సునిత, ఏఈ రాజేందర్‌లు పనులను పరిశీలించారు.

విద్యార్థినికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న కళాశాల ఉపాధ్యాయబృందం

కోటపల్లి: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన కొత్తూరి మహేశ్ స్వరూప దంపతుల కూతురు స్రవంతి చిన్నవయసులోనే తండ్రిని కోల్పోయింది. అయినా 2022–23 సంవత్సరం ఇంటర్మీడియట్ టీఎస్‌డబ్ల్యూ సిర్పూర్ కళాశాలలో హెచ్ఈసీ గ్రూప్ చదివి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోనే మొదటి ర్యాంక్ సాధించింది. అందుకుగాను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, అధ్యాపక బృందం స్రవంతిని, తల్లి స్వరూపను శాలువాతో ఘనంగా సన్మానించి రూ.25వేల చెక్కును అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పునరుద్ధరణతో పునరుజ్జీవం

- మున్సిపాలిటీల్లో చెరువుల రక్షణకు చర్యలు
- మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల సమన్వయంతో హద్దుల గుర్తింపు
- మురుగునీరు చేరకుండా సుందరీకరణ పనులు
- ఇటీవల అధికారులకు హైదరాబాద్‌లో అవగాహన



రామునిచెరువులో పూడిక, నాచుతో మురికిగా నీరు



రామునిచెరువు మత్తడికి గండి కొట్టి నీటిని కిందకు వదులుతున్న దృశ్యం

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రాల్లోని మున్సిపాలిటీల పరిధిలోని చెరువులను పునరుద్ధరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. మే 21వ తేదీన హైదరాబాద్‌లో జిల్లా కేంద్రాల్లోని మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో చెరువులకు హద్దులు కేటాయించడం, చెరువుల్లోకి మురికి నీరు గాని, డ్రెయినేజీ నీరు గాని వెళ్లకుండా చూడడంతో పాటు, అందులో చేరిన మురికి నీటిని శుద్ధి చేసి, పిచ్చి మొక్కలు, నాచు వంటి వాటిని తొలగించి, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా చేయడంపై మూడు శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. పట్టణాల్లోని ప్రతి చెరువు ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడంతో పాటు, సాయంత్రం వేళ చిన్నారులతో కలిసి ఆడుకునేలా ఏర్పాట్లు చేయడం, అందులోని నీరు మురికిగా కాకుండా, స్వచ్ఛమైన నీరు ఉండేలా చేసేందుకు ప్రభుత్వం చెరువుల పరిరక్షణకు కార్యాచరణను సిద్ధం చేస్తోంది. మున్సిపల్ కమిషనర్లకు బాధ్యతలను అప్పగించనుండడంతో, జిల్లా కేంద్రంలోని చెరువులకు పూర్వవైభవం వస్తుందనే భావన వ్యక్తం అవుతోంది.

మంచిర్యాల మున్సిపాలిటీలోని చెరువులు, వాటి విస్తీర్ణం

చెరువు	ఏరియా	విస్తీర్ణం (ఎకరాల్లో)
రాముని చెరువు	జన్మభూమినగర్	47.32
పోచమ్మ చెరువు	హమాలివాడ	64.39
కొత్త చెరువు	తిలక్‌నగర్	83.20
సాయికుంట చెరువు	గర్మిళ్ల	8.11
పెద్దకుంట చెరువు	రంగంపేట్	13.30
చిన్నకుంట చెరువు	రంగంపేట్	16.14
కుమ్మరికుంట చెరువు	రంగంపేట్	6.09
చీకటి వెలుగుల కుంట	ఏసీసీ	2.35

కాలుష్యం నుంచి విముక్తి..

ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోనుండడంతో చెరువుల్లోని నీటిని శుద్ధి చేసి, కాలుష్యం నుంచి విముక్తిని కలిగించేందుకు అవకాశం ఉంది. ముందస్తుగా ఆయా చెరువుల విస్తీర్ణం ఎంత, అందులోని నీటి నిల్వ సామర్థ్యం, డ్రెయినేజీల నుంచి చెరువులోకి నీరు వచ్చి చేరుతుందా, ఒకవేళ వస్తే, ఆ నీటిని ఏ విధంగా చెరువులోకి రాకుండా అడ్డుకోవడం, లేదా మురుగు నీటిని శుద్ధి చేసి చెరువులోకి వదలడం, చెరువులో పెరిగిన పిచ్చి మొక్కలు, నాచు వంటివి ఉన్నాయా, ఉంటే వాటిని తొలగించి, చెరువు కట్టపైన ప్రజలను ఆకర్షించేలా పూలమొక్కలు, అందమైన చెట్లను నాటడం, చిన్నారులు చెరువు వద్దకు వచ్చినప్పుడు ప్రమాదం జరగకుండా ఉండేందుకు గాను రక్షణ ఏర్పాట్లు వంటివి చేయడంపై మున్సిపల్ కమిషనర్ల నుంచి ప్రభుత్వం నివేదిక కోరింది. నివేదికలను అందుకున్న అనంతరం చెరువుల పునరుద్ధరణ పనులను ప్రారంభించేందుకు అవకాశం ఉంది.

కబ్జా భూములను రక్షిస్తారా....?



పోచమ్మచెరువు భూమి కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ

జిల్లా కేంద్రంలోని చెరువులను, వాటి శిఖం భూములు, మత్తడి కాలువల్లో ఎక్కువ భాగం కబ్జాకు గురైన వాటిలో ముందుండేవి పోచమ్మ చెరువు, రాముని చెరువులే. శిఖం భూములు, చెరువుకు సంబంధించిన భూముల్లో కొందరు వెంచర్లు వేసి అమ్ముకోగా, మరికొందరు రోడ్లు వేశారు. మత్తడి కాలువను సైతం కబ్జా చేసి భవనాలను నిర్మించారు. చెరువులోని నీటిని ఖాళీ చేసి, శిఖం భూములను కబ్జా చేసేందుకు రామునిచెరువు మత్తడికి గండికొట్టారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. తిలక్‌నగర్‌లోని కొత్త చెరువు, సాయికుంట చెరువు, చీకటి వెలుగుల కుంట, కుమ్మరికుంట, రంగంపేట్‌లోని చెరువుల శిఖం భూములను కబ్జా చేశారు. ఆక్రమణలకు గురైన చెరువులకు మూడు శాఖల అధికారులు హద్దులను ఏర్పాటు చేసి పునరుద్ధరణ చేస్తే, భవిష్యత్ తరాలకు చెరువులు జలకళతో అలరించడంతో పాటు, భూగర్భ జలాలను పెంపొందించేందుకు అవకాశం ఉంది.

చెరువులను సుందరీకరిస్తాం



మున్సిపాలిటీలోని అన్ని చెరువులను ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులతో కలిసి వాటికి హద్దులు నిర్ణయించి, ఆయా చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకుని, చెరువులను సుందరీకరిస్తాం. దీనిపై ఇటీవల హైదరాబాద్‌లో అవగాహన కల్పించారు. చెరువులకు సంబంధించిన పూర్తి వివరాలతో ఇరిగేషన్, రెవెన్యూ శాఖ వారి సహకారంతో నివేదికను రూపొందించి, ప్రభుత్వానికి అందించిన తరువాత పునరుద్ధరణ పనులు చేపడుతాం.

– మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

విద్యుత్ తీగలు సరిచేశారు..!



స్తంభం వేసి తీగలు సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

జన్నారం: కవ్వాల్‌లోని రైతుల పొలాల్లో కిందికి వేలాడే తీగలను విద్యుత్ అధికారులు సరిచేశారు. ఈ నెల 3న 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురితం అయిన కథనానికి అధికారులు స్పందించారు. స్తంభం మధ్యన దూరం ఉండటంతో, మరో స్తంభం ఏర్పాటు చేసి తీగలను సరి చేసినట్లు సబ్ ఇంజనీర్ అజయ్ తెలిపారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా సాయి చరణ్



నియామక పత్రం అందజేస్తున్న మహేందర్

బెల్లంపల్లి: యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా బెల్లంపల్లికి చెందిన దెబ్బెటి సాయి చరణ్ నియామకమయ్యారు. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సాయిచరణ్‌కు యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల మహేందర్ నియామకపత్రాన్ని అందజేశారు. జిల్లాలో యూత్‌కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి రంజిత్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పి.హరీష్, పట్టణ ప్రధాన కార్యదర్శి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

గూండాయిజాన్ని పెంచిపోషించింది మాజీ ఎమ్మెల్యేనే

- మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యేగా 20ఏళ్లు పనిచేసిన మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన తనయుడు నడిపెల్లి విజిత్‌రావులే ప్రశాంతమైన వాతావరణానికి నెలవైన మంచిర్యాలలో గూండాయిజం, రౌడీయిజాన్ని పెంచి పోషించారని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య ఆరోపించారు. జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్‌లతో కలిసి మాట్లాడారు. దివాకర్‌రావు కంటే ముందు పనిచేసిన ఎమ్మెల్యేల హయాంలో ఎలాంటి గొడవలు జరగలేదని, దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావు ప్రోత్సాహంతో గుండాలు, రౌడీలు దాడులకు ఎగబడుతున్నారని ఆరోపించారు. గతంలో బీజేపీ నిరసన కార్యక్రమాలు చేస్తే, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను విజిత్‌రావు రెచ్చగొట్టడం దివాకర్‌రావుకు కనిపించ లేదా అని ప్రశ్నించారు. గడప రాకేశ్‌పై జరిగిన దాడిని తాము కూడా ఖండిస్తున్నామని, రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణను కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు ముడిపెట్టడం సరికాదని, ప్రజలకు నిజానిజాలు తెలుసునని అన్నారు. ప్రేమ్‌సాగర్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేసిన దివాకర్‌రావు వెంటనే ఎమ్మెల్యేకు క్షమాపణలు చెప్పాలని, ఎక్కడ గొడవలు జరిగినా ప్రేమ్‌సాగర్‌రావుపై నెపం వేయడం సరికాదన్నారు.

'వంశీకృష్ణ గెలువాలని శివాలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చెన్నూర్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ రెండు లక్షల మెజార్టీతో గెలువడం ఖాయమని కాంగ్రెస్ నాయకులు అయిత హిమవంత రెడ్డి అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న సందర్భంగా వంశీకృష్ణ భారీ మెజార్టీతో గెలువాలని కోరుతూ సోమవారం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునందర్‌రెడ్డి, చింతల శ్రీనివాస్, కడవండి మహేశ్, పాతర్ల నాగరాజులు పాల్గొన్నారు.

నేత్రదానం చేయాలి



సర్టిఫికెట్ ఇస్తున్న సదాశయ ఫౌండేషన్ సభ్యులు

శ్రీరాంపూర్: మరణాంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను ఇతరులకు దానం చేయడం వల్ల మరొకరి జీవితాల్లో వెలుగునివ్వచ్చని, అందుకే నేత్రదానం చేయాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి తెలిపారు. ఆర్కే 8కాలనీకి చెందిన సింగరేణి మాజీ ఉద్యోగి పీ.సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. ఆయన నేత్రలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారికి సర్టిఫికెట్‌ను అందించి వారి ఇంటి వద్ద నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించి నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నస్పూర్‌కు చెందిన కర్రె మొగిలి, మైపాల్ రెడ్డి, సంజీవరెడ్డి, రాజయ్య వారు అవయవ దేహదానానికి ముందుకొచ్చి అంగీకారం తెలిపారు. వారికి డోనర్‌కార్డులను ఫౌండేషన్ సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారులు నూక రమేష్, జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, మంచిర్యాల జిల్లా బాధ్యులు రామ్ రెడ్డి, శ్రీనాథ్, వాసు, కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డిలు పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వర కథా సప్తాహం



కల్యాణం జరిపిస్తున్న పండితులు

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయంలో వారం రోజులుగా భారతీ తీర్థ పుష్కర గ్రహీత బాచంపల్లి సంతోశ్‌కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వేంకటేశ్వర కథా సప్తాహం సోమవారం ముగిసింది. సప్తాహం ముగింపు సందర్భంగా వేంకటేశ్వర కల్యాణ వేడుకను కనుల పండువగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు పులి దత్తాత్రేయ పద్మ, పులి సీతారామశర్మ, అర్చకులు దామెర అనిలాచార్యులు, అజయ్‌చార్యులు పాల్గొన్నారు.

'కొక్కిరాల కుటుంబం సేవలో ముందుంటుంది'



దేవాపూర్‌లో అంబలి పంపిణీ చేస్తున్న నాయకులు

కాసిపేట: కార్మికులకు, గ్రామస్తులకు రెండు నెలల పాటు అంబలి పంపిణీ చేయడం అభినందనీయమని కొక్కిరాల కుటుంబం ఎల్లప్పుడూ సేవలో ముందుంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ తెలిపారు. దేవాపూర్‌లో సోమవారం అంబలి పంపిణీ ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో సైతం రఘుపతిరావు అభిమానులుగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆవరణలో కార్మికులకు, గ్రామస్తులకు తీవ్ర వేసవి దాహం తీర్చేందుకు అంబలి పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు సత్తార్, ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, భీమ్‌రావు, శంకర్, అన్నం కుమార్, రషీద్, షాకీర్, ఖదీర్, కలీం, మాజీ సర్పంచ్ మడావి వెంకటేష్, కనకరాజు, అనంతరావు, సత్యం, కొమ్ముల బాపు, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏవోకి వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: గత రాష్ట్ర ప్రభుత్వ చిహ్నాన్ని తొలగించి ప్రస్తుత ప్రభుత్వం కొత్త చిహ్నాన్ని (రాజముద్ర)ప్రవేశపెట్టిన దాంట్లో బీఆర్ అంబేద్కర్, పండుగ సాయన్న, సర్దార్ సర్వాయి పాపన్న, సమ్మక్క సారక్కల ఫొటోలు ఉండాలని కోరుతూ ధర్మసామాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ధర్మసామాజ్‌పార్టీ జిల్లా నాయకులు ప్రశాంత్, రామస్వామి, నాయకులు రాజు, చంద్రశేఖర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

'శ్యామల కుటుంబానికి అండగా ఉంటాం'



శ్యామలను పరామర్శిస్తున్న జాన్సన్‌నాయక్

జన్నారం: పిడుగుపాటుకు రేకులు పగిలి నిరాశ్రయురాలిగా ఉన్న శ్యామల కుటుంబానికి అండగా ఉంటామని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ పేర్కొన్నారు. సోమవారం శ్యామల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణం కోసం రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. అధైర్య పడొద్దని, ఈ విషయంలో అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చీకట్లో సింగపూర్ గ్రామం



మరమ్మతు చేస్తున్న సింగరేణి అధికారులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓసీపీతో ముంపు గ్రామమైన సింగపూర్ కరెంట్ లేక చీకటిమయం అయ్యింది. ఓసీపీతో ఈ గ్రామం కొన్నేళ్ల క్రితం పూర్తిగా ముంపునకు గురైంది. దీంతో ప్రభుత్వ విద్యుత్‌ను నెల రోజుల క్రితం తొలగించి, దాని స్థానంలో కంపెనీ విద్యుత్ సరఫరా చేస్తుంది. అయితే ఆదివారం సాయంత్రం 5గంటలకు గ్రామ సమీపంలో గౌరవ్ ఓబీ సంస్థ క్యాంపు వద్ద సింగరేణి విద్యుత్‌లైన్‌లోని ఇన్సులేటర్ చెడిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో సింగపూర్ గ్రామానికి పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వెంటనే గ్రామస్తులు ఓసీపీ ప్రాజెక్టు అధికారికి, ఏరియా ఎస్ఓటూ జీఎంకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఐనప్పటికీ ఫలితం లేదు. ఆదివారం రాత్రంతా కూడా విద్యుత్‌లేక గ్రామస్తులు చీకట్లోనే ఉండాల్సి వచ్చింది. సోమవారం మధ్యాహ్నం వరకు కూడా విద్యుత్ సరఫరా కాకపోవడంతో గ్రామస్తులు జీఎంను కలిసి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముంపు గ్రామమని తమను చిన్న చూపు చూశారని గ్రామస్తులు వాపోయారు. సమస్యను పరిష్కరించడానికి అధికారులు తీవ్ర జాప్యం చేస్తున్నారని తెలిపారు. దీంతో ఆయన తక్షణమే విద్యుత్‌ను పునరుద్ధరించాలని తెలియజేయడంతో అధికారులు విద్యుత్ పునరుద్ధరణ కోసం విద్యుత్ లైన్‌ను సరి చేస్తున్నారు. రాత్రి 8:30 గంటలకు కరెంట్ వచ్చింది.

ఊరచెరువు మత్తడికి మరమ్మతు చేపట్టండి



ఊర చెరువు మత్తడికి గండిపడ్డ ప్రదేశం

భీమారం: స్థానిక బస్టాండ్ సమీపంలో గల ఊర చెరువు మత్తడి తెగి ఏళ్లు గడుస్తున్నా, ఇప్పటికీ మరమ్మతు చేపట్టడం లేదు. దీంతో వర్షాకాలంలో వచ్చిన వరదనీళ్లు చెరువులో నిల్వ ఉండకుండా వృథాగా వెళ్లిపోతున్నాయి. బస్టాండ్ సమీపంలో గల ఈ చెరువు కింద సాగు విస్తీర్ణం 10ఎకరాలు ఉన్నప్పటికీ చెరువులో నీళ్లు ఉంటే సమీపంలోని బోరుబావుల్లో నీరు లభ్యత ఎక్కువగా ఉంటుంది. మత్తడికి రెండేళ్ల క్రితం గండిపడిందని స్థానికులు తెలిపారు. ఏళ్లు గడుస్తున్నా ఇరిగేషన్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఊర చెరువుని రూ.3కోట్లతో అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌గా రూపొందిస్తానని ప్రకటించారని తెలిపారు. అయితే తిరిగి ఈ సారి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుమన్ ఓడిపోవడంతో చెరువు అభివృద్ధి వెనుకబడిపోయిందన్నారు. ప్రస్తుత చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి చెరువు మత్తడి నిర్మించేందుకు నిధులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ఫ్లెక్సీలు



వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా వద్ద కిందపడిన ఫ్లెక్సీ

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇష్టారీతిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలో ఈదురుగాలుల దాటికి కొన్ని ఫ్లెక్సీలు చినిగిపోగా, మరికొన్ని ఇలా రోడ్లపై పడుతున్నాయి. ఈదురు గాలులకు తోడు, వర్షం పడుతుండడంతో ఫ్లెక్సీలు కిందపడి వాహనదారులకు, పాదాచారులకు ఎలాంటి ప్రమాదాన్ని తెచ్చి పెడతాయోననే భయం నెలకొంది. ఆదివారం రాత్రి వీచిన ఈదురు గాలులకు మంచిర్యాల పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రోడ్డుపై పడిపోయింది. ఫ్లెక్సీ పడి, ఒక రోజు అయినా, దానిని మున్సిపల్ అధికారులు తొలగించకపోవడంతో, వాహనదారులకు ఇబ్బందిగా మారింది.